క్లుప్తంగా

సచివాలయ ఉద్యోగులకు సమయపాలన తప్పనిసరి



దేవరవలస సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీడీఓ

జి.సిగడాం: సచివాలయం ఉద్యోగులు సమయపాలన పాటించకపోతే చర్యలు తప్పవని ఎంపీడీఓ గుంటముక్కల రామకృష్ణారావు హెచ్చరించారు. గురువారం దేవరవలస, గెడ్డకంచరాం సచివాలయాలను తనిఖీ చేశారు. మండలంలో 31 మంది బయోమెట్రిక్ హాజరు వేయలేదని, ఇదే పరిస్థితి కొనసాగితే కలెక్టర్ ఆదేశాల మేరకు చర్యలు తప్పవన్నారు. సమయపాలన పాటించని వారికి షోకాజ్ నోటీసులు జారీ చేస్తున్నట్లు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో అష్టమి భజనలు

గార: మండలంలోని రామచంద్రాపురం పంచాయతీ జొన్నలపాడు కాలనీలో శ్రీశ్రీ బృందావనంలో అష్టమి పర్వదినం సందర్భంగా గురువారం సాయంత్రం ప్రత్యేక భజన కార్యక్రమాలు జరిగాయి. ఉదయం శ్రీకృష్ణునికి చౌదరి దుర్గారావు దంపతులు పూజలు చేయగా, సాయంత్రం సింహాద్రి శ్రీనివాసరావు, దుర్గాప్రసాద్ పండా, జామి సాంబమూర్తి, జోగ అప్పలరాజు, చౌదరి శ్రీనివాస్ తదితరులు భక్తిగీతాలు ఆలపించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

గురుకులంలో ప్రవేశాలకు ఆహ్వానం

శ్రీకాకుళం రూరల్: శాస్త్రులపేటలోని మహాత్మాజ్యోతిబా పూలే ఆంధ్రప్రదేశ్ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల విద్యాలయం (బాలురు, బాలికలు)లో 20025–26 విద్యా సంవత్సరానికి గాను ఇంటర్మీడియట్, 5వ తరగతి, బ్యాక్‌లాగ్ (6,7,8,9 తరగతులకు)లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సింగూరు అనురాధ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్‌లో మార్చి 15లోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఇంటర్మీడియట్ ప్రవేశపరీక్ష ఏప్రిల్ 20న, 5వ తరగతి ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 27న, 6,7,8,9 తరగతులకు ఏప్రిల్ 28న పరీక్ష ఉంటుందని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 9618880991 నంబర్‌ను సంప్రదించవచ్చన్నారు.

క్యాన్సర్‌పై అవగాహన అవసరం



అవగాహన సదస్సులో చిన్నారులు

శ్రీకాకుళం రూరల్ : సింగుపురం ప్రశాంతినగర్‌లోని శ్రీశారద విద్యానికేతన్‌లో గురువారం క్యాన్సర్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. పీఎంపీ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎ.ముసలినాయుడు మాట్లాడుతూ క్యాన్సర్ లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో వైద్యులు వెంకట్రావు, ప్రిన్సిపాల్ ఎం.రామ్మోహన్, వండాన శిమ్మన్న, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

నేటి నుంచి త్యాగరాజస్వామి ఆరాధనోత్సవాలు

శ్రీకాకుళం కల్చరల్ : శ్రీకాకుళం మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో బాపూజీ కళామందిర్‌లో ఈ నెల 21 నుంచి 23 వరకు త్యాగరాజస్వామి ఆరాధనోత్సవాలు జరుగుతాయని నిర్వాహకులు మావుడూరి సత్యనారాయణ శర్మ ఒక ప్రకటనలో తెలిపారు. 21న బెంగళూరుకు చెందిన ఆకాశవాణి, దూరదర్శన్ కళాకారులు కస్తూరి కమలాదీప్త గాత్ర సంగీత కచేరి, 22న చెన్నైకు చెందిన టీవీ, ఆకాశవాణి కళాకారులు రామకృష్ణన్‌మూర్తి గాత్ర కచేరి, 23న విజయవాడకు చెందిన టీవీ, ఆకాశవాణి కళాకారులు విష్ణుభట్ల సోదరీమణులైన కృష్ణవేణి, సరస్వతి గాత్ర కచేరి నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. స్థానిక కళాకారులచే మూడు రోజులు త్యాగరాజ సంకీర్తనార్చనలు, 23న విశాఖకు చెందిన ఆకొండి వెంకటరావు, స్థానిక కళాకారులచే పంచరత్న సేవ జరుగుతుందని, కళాభిమానులంతా హాజరుకావాలని కోరారు.

రైతులకు విశిష్ట గుర్తింపు సంఖ్య



అర్జునవలసలో వివరాలు నమోదు చేయించుకుంటున్న రైతులు

రణస్థలం : ఫార్మర్ రిజిస్ట్రీలో నమోదు చేసుకున్న రైతులందరికీ 11 అంకెల విశిష్ట గుర్తింపు సంఖ్య (యూనిక్ ఐడీ నంబర్) ఇస్తున్నట్లు మండల వ్యవసాయాధికారి డి.విజయభాస్కర్ తెలిపారు. గురువారం అర్జునవలస రైతు సేవా కేంద్రంలో రైతులకు ఫార్మర్ రిజిస్ట్రీలో వివరాలను నమోదు చేశారు. 2025–26 నుంచి పీఎం కిసాన్, అన్నదాత–సుఖీభవ, వడ్డీలేని పంట రుణాలు, ఇన్‌పుట్ సబ్సిడీ, సూక్ష్మ సేద్య పరికరాలు వంటి రాయితీ పథకాలు పారదర్శకంగా అందించడానికే రైతులకు యూనిక్ ఐడీ నంబర్లు ఇస్తున్నట్లు చెప్పారు. సొంత భూమి కలిగిన ప్రతి రైతూ రైతు సేవా కేంద్రంలో వ్యవసాయ సహాయకుల ద్వారా వివరాలు నమోదు చేయించుకోవాలని సూచించారు.

మాట వింటారా..
కటకటాల వెనక ఉంటారా..



- విద్యాసంస్థల వద్ద మఫ్టీలో పోలీసులు
- ఆకతాయిలకు హెచ్చరికలు
- తల్లిదండ్రుల సమక్షంలో పోలీస్‌స్టేషన్‌లో కౌన్సిలింగ్
- మారకపోతే కేసులు పెడతామని వార్నింగ్

శ్రీకాకుళం క్రైమ్ :

అమ్మాయిల ముందు మెలికలు తిరిగేలా ర్యాష్‌గా బైక్ షికారు చేస్తే స్టేషన్‌లో దెబ్బలు తప్పవని పోలీసులు హెచ్చరిస్తున్నారు. విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తూ.. చంటిగాడు లోకల్ అంటూ రెచ్చిపోతే షీట్లు తెరిచి నాన్‌లోకల్ ఏరియాకు పంపిస్తామని గట్టిగా వార్నింగ్ ఇస్తున్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించి న్యూసెన్సు చేసినా.. గంజాయితో పట్టుబడినా, పీల్చుతూ దాడులకు ఎగబడినా పీడీయాక్టులు ఓపెన్ చేసి కటకటాల వెనక్కి పంపిస్తామంటున్నారు. పరిస్థితి మితిమీరితే ఆస్తులు సైతం జప్తు చేస్తామని హెచ్చరిస్తున్నారు.

ఇటీవల జిల్లాలో ముఖ్యంగా శ్రీకాకుళం నగర పరిధిలో అసాంఘిక కార్యకలాపాలు పెరిగి తీవ్ర మత్తులో యువత నేరాల వైపు ప్రభావితమవుతున్నారనే ఉద్దేశంతో ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి ప్రత్యేక దృష్టి సారించారు. డీఐజీ గోపినాథ్ జెట్టి సైతం బుధవారం జరిగిన వీడియో కాన్ఫరెన్సు ద్వారా ఎస్పీతో సమీక్షలో ప్రత్యేక ఆదేశాలు జారీచేశారు.



శ్రీకాకుళం రెండో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో కౌన్సిలింగ్ ఇస్తున్న డీఎస్పీ వివేకానంద

మఫ్టీలో పోలీసులు..

యువత ఆగడాలు మితిమీరడంతో డీఎస్పీ సిహెచ్ వివేకానంద నేతృత్వంలో ఒకటి, రెండో పట్టణ సీఐలు సీహెచ్ పైడపునాయుడు, పి.ఈశ్వరరావు, ఎస్ఐలు ఎం.హరికృష్ణ, సంతోష్‌కుమార్, స్టేషన్ సిబ్బందే కాకుండా స్పెషల్‌బ్రాంచి, ఎస్పీ స్పెషల్ టాస్క్‌ఫోర్స్ బృందాలతో మఫ్టీలో ఎస్పీ ప్రత్యేక నిఘా పెట్టించారు. మహిళా పోలీస్ (దిశా) బృందాలు సైతం బీట్లు తిరుగుతున్నాయి. రద్దీ కూడళ్లు, ఉమెన్స్ కళాశాల, ఆర్ట్స్ కళాశాల, ఇతర విద్యాసంస్థల పరిసర ప్రాంతాల్లో ఉదయం, సాయంత్రం వేళల్లో తిరుగుతున్నారు. విద్యార్థినులను వెంటాడి వేధించేవారిని జీపెక్కించి నేరుగా స్టేషన్‌కు తీసుకెళ్తున్నారు. వారి తల్లిదండ్రులను పిలిపించి డీఎస్పీ వివేకానంద నేతృత్వంలో కౌన్సిలింగ్ ఇస్తున్నారు. జాగ్రత్తగా మసులుకోవాలని హెచ్చరిస్తూనే భవిష్యత్తుకు చక్కని పునాదులు వేసుకోవాలని సూచిస్తున్నారు. కాశీబుగ్గ–పలాస, టెక్కలి, ఇచ్ఛాపురం, ఆమదాలవలస, ఎచ్చెర్ల పట్టణాల్లో సైతం విద్యాసంస్థల పరిసర ప్రాంతాల్లో ఇప్పటికే పోలీసులు మఫ్టీలో తిరుగుతున్నారు.



గురువారం ఉమెన్స్ కళాశాల వద్ద విద్యార్థులను ఆరా తీస్తున్న మఫ్టీ పోలీసులు



ఆకతాయిలను తీసుకెళ్తున్న మఫ్టీలో ఉన్న ఎస్ఐ హరికృష్ణ

డ్రోన్‌లతో నిఘా..

జిల్లాలోని ముఖ్య పట్టణ కేంద్రాలు, శివారు నిర్మానుష్య ప్రాంతాలు, నదీపరివాహక ప్రాంతాల్లో పాడుబడిన భవనాలు, అనుమానిత నివాస పరిసరాల్లో డ్రోన్ కెమెరాలతో నిఘా పెట్టారు. గంజాయి కాక బహిరంగంగా మద్యం సేవించడం, పేకాట, అమ్మాయిలను ఈవిటీజింగ్ చేయడం, చైన్‌స్నాచింగ్, జూదం వంటి నేర కలాపాలు పాలుపంచుకునే వారిని ఈ కెమెరాలు చిత్రీకరిస్తాయి. ప్రధాన చెక్‌పోస్టులతో పాటు రైల్వేస్టేషన్లు, బస్‌స్టేషన్లు, పార్సిల్, ట్రావెల్స్ సెంటర్‌లలో నార్కోటిక్ కెనైన్ డాగ్‌లతో విస్తృత తనిఖీలు చేయిస్తున్నారు. ఇవికాక మొబైల్ పెట్రోలింగ్, ప్రత్యేక బృందాలు సైతం ఉన్నాయి.

ఇటీవల ఘటనలు..

- జిల్లాకేంద్రంలోని ఉమెన్స్ కళాశాల ప్రాంగణంలోని వసతిగృహ డిగ్రీ విద్యార్థిని పెళ్లికి ఒప్పుకోలేదని ఓ యువకుడు దారుణంగా దాడి చేశాడు. ఈ ఘటన రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం రేపింది.
- శ్రీకాకుళం రూరల్ మండలం పాత్రునివలస టిడ్కో ఇళ్లు, పొట్టిశ్రీరాములు మార్కెట్టు సమీపంలో యువకులు గంజాయి సేవిస్తూ పట్టుబడటం, వీటిలో ఓ ఘటనకు సాక్ష్యంగా ఎమ్మెల్యే శంకర్ ఉండటంతో అసాంఘిక కార్యకలాపాలు శృతిమించాయని నిర్ధారణైంది.
- వసతిగృహాల్లో విద్యార్థినులు లైంగిక వేధింపులకు గురవుతుండటం, లేదంటే కారణం చనిపోవడం జరుగుతున్నాయి. ఇవి కూడా పోలీసులు అలెర్ట్ కావడానికి ముఖ్య కారణం. మత్తులో చాలా మంది యువత అనేక నేరాలు చేసి పోలీసులకు సవాల్ విసురుతుండటంతో వీరి పనిపట్టాలని పోలీసులూ సంసిద్ధమయ్యారు.

వినకపోతే..



ఎన్ని కఠిన చట్టాలున్నా, పోక్సో, నిర్భయ వంటి సెక్షన్లున్నా యువతలో మార్పు రావడం లేదు. అందుకే ఎస్పీ ఆలోచనలతో కళాశాలలు, విద్యాసంస్థలు, ముఖ్య రద్దీప్రాంతాలు, కూడళ్లలో మఫ్టీలో పోలీసుల నిఘా పెట్టాం. ఆకతాయిలను ముందుగా హెచ్చరిస్తాం. వినకపోతే షీట్లు, పీడీ యాక్టులు తెరుస్తాం. ఆస్తులను జప్తు చేస్తాం.

– సీహెచ్ వివేకానంద, శ్రీకాకుళం డీఎస్పీ

నిత్యం నిఘా



ఎస్పీ ఆదేశాలతో మూడు రోజులుగా ఉమెన్స్ కళాశాల, చైతన్య కళాశాల, భాష్యం, గీతాంజలి తదితర ప్రాంతాల్లో మఫ్టీలో మా బృందాలు తిరుగుతున్నాయి . ఓ రోజు 48, మరో రోజు 40, గురువారం సాయంత్రానికి ఆకతాయిలు కాస్త తగ్గారు.

– సీహెచ్ పైడపునాయుడు, సీఐ, శ్రీకాకుళం ఒకటో పట్టణ పీఎస్

మార్పు వస్తుంది..



స్కూళ్లు, కళాశాలలు ప్రారంభ, వదిలే సమయాల్లో దృష్టి పెడుతున్నాం. ఆర్టీసీ కాంప్లెక్స్, బలగ, డేఅండ్‌నైట్, రిమ్స్, కొన్ని వసతిగృహాలను తనిఖీ చేస్తున్నాం. ఆర్ట్స్ కళాశాలలో ఇంతకుముందు నుంచే అసాంఘిక కార్యకలాపాలపై నిఘా పెట్టి కట్టడి చేశాం. మార్పు వస్తుంది.

– పి.ఈశ్వరరావు, సీఐ, రెండో పట్టణ పీఎస్

‘పరశురాం పాత్రో’ జీవిత చరిత్ర పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు, నిర్వాహకులు

శ్రీకాకుళం కల్చరల్: ఆధునిక సమాజంలో సంస్కరణలకు ఆద్యుడిగా పేరొందిన ‘రావు బహదూర్ సర్ అన్నెపు పరశురాం’ పాత్రో జీవిత చరిత్ర పుస్తకావిష్కరణ శ్రీకాకుళం కొత్తరోడ్డులోని ఓ కన్వెన్షన్ హాలులో గురువారం జరిగింది. కళింగ కల్చరల్ క్లబ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు వక్తలు మాట్లాడుతూ పాత్రో జీవితం నేటి సమాజానికి అందించాలని సంకల్పించిన రచయిత గూన అప్పారావును అభినందించారు. పరశురాం స్వాతంత్ర్యానికి ముందు 1923లో మద్రాసు ప్రెసిడెన్సీలో విద్యాశాఖ మంత్రిగా ఉంటూ విశాఖలో ఆంధ్రా యూనివర్సిటీని ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. ఈ సందర్భంగా పుస్తక రచయితతో పాటు ఆహ్వాన కమిటీ అధ్యక్షులు బుడుమూరు శ్రీరామమూర్తిలను మాజీ ఎంపీపీ కూన ప్రమీల సత్కరించారు. కార్యక్రమంలో విశ్రాంత జిల్లా న్యాయమూర్తి పప్పల జగన్నాథరావు, మాజీ వైస్ చాన్సలర్ హనుమంతు లజపతిరాయ్, మాజీ ఐఏఎస్ సూర బాలకృష్ణారావు, జిల్లా విజిలెన్సు, మానిటరింగ్ సభ్యులు బి.వి.ఎస్.ఎన్.రాజు, ప్రొఫెసర్ గుంట లీలా వరప్రసాద్, దుప్పల రవికుమార్, డాక్టర్ పి.సూర్యం, గురుగుబెల్లి నాగరాజు, కొంక్యాన వేణుగోపాల్, బాడాన దేవభూషణ్, అన్నెపు సూర్యనారాయణ, బి.శ్రీరామమూర్తి, బొడ్డేపల్లి మోహనరావు, మెట్ట అన్నాజీ భట్లు, డాక్టర్ అన్నెపు శశిధర్ పాల్గొన్నారు.

వార్షికోత్సవ పూజలు ప్రారంభం

ఎచ్చెర్ల క్యాంపస్: జాతీయ రహదారికి ఆనుకొని ఉన్న లక్ష్మిడిపేటలోని కోదండ రామస్వామి ఆలయం వార్షిక కల్యాణోత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. ఈ నెల 25 వరకు పూజలు కొనసాగనున్నాయి. మొదటి రోజు విష్వక్సేన ఆరాధనతో ప్రత్యేక పూజలు ప్రారంభించారు. ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

షిర్డీసాయికి ప్రత్యేక పూజలు



పూజలందుకుంటున్న స్వామివారు

శ్రీకాకుళం కల్చరల్: బొందిలీపురంలోని దర్బార్ షిర్డీసాయి బాబా మందిరంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు సంతోష్ బ్రహ్మ, సురేష్ బ్రహ్మ ఆధ్వర్యంలో స్వామివారికి మూడు హారతులు, ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఫ్లై ఓవర్ సమావేశం నేడు

రణస్థలం: రణస్థలం పట్టణంలో జాతీయ రహదారుల సంస్థ నిర్మించనున్న ఫ్లై ఓవర్‌కు సంబంధించి తహశీల్దార్ కార్యాలయంలో శుక్రవారం ఉదయం 10గంటలకు సమావేశం నిర్వహించనున్నట్లు హైవే అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు ఆధ్వర్యంలో జరిగే ఈ సమావేశానికి వ్యాపారులు, భవన యజమానులు హాజరుకావాలని కోరారు.

వైఎస్ జగన్‌ను కలిసిన నాయకులు



వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో గొర్లె కిరణ్‌కుమార్



వైఎస్ జగన్‌ను కలిసిన దుంపల రామారావు

పార్వతీపురం మన్యం జిల్లా పాలకొండలో పాలవలస రాజశేఖరం కుటుంబాన్ని పరామర్శించేందుకు విచ్చేసిన మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని గురువారం పలువురు ప్రముఖులు మర్యాదపూర్వకంగా కలిశారు. వారిలో ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కాళింగ విభాగం అధ్యక్షుడు దుంపల రామారావు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత పైడి శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

–రణస్థలం



వైఎస్ జగన్‌ను కలిసిన పైడి శ్రీనివాసరావు

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించండి

శ్రీకాకుళం పాతబస్టాండ్ : రాష్ట్ర ప్రభుత్వ పింఛనుదారుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏపీ స్టేట్ పెన్షన్‌దారుల సంఘం ప్రతినిధులు గురువారం ఖజానా శాఖ అధికారి రవికుమార్, ఉప ఖజానా అధికారి చింతాడ రామారావుకు వినతిపత్రం అందజేశారు. విడో పెన్షనర్ల నుంచి అన్‌మ్యారీడ్ సర్టిఫికెట్ ప్రతి ఆరునెలలకోసారి కాకుండా ఏడాదికోసారి లైఫ్ సర్టిఫికెట్‌తో కలిపి గజిటెడ్ అధికారిచే సంతకం చేయించి ఇస్తే తీసుకునే వెసులు బాటు కల్పించాలని కోరారు. పెన్షనర్ల అదాలత్ ఏర్పాటు చేయాలని విన్నవించారు. కార్యక్రమంలో ఏపీ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎంఎస్‌ఆర్‌ఎస్ ప్రకాశరావు, జిల్లా శాఖ అధ్యక్షుడు కె.సోమేశ్వరరావు, పెన్షనర్ల రాష్ట్ర సంఘ ఉపాధ్యక్షుడు ప్రకాశరావు, ప్రధాన కార్యదర్శి పి.ప్రసాదరావు, సహాధ్యక్షులు నరసింహమూర్తి, సిటీ బ్రాంచ్ అధ్యక్షుడు బి.జానకిరాం పట్నాయక్, కోశాధికారి కె.రామమోహనరావు, నాయకులు రాధాప్రసాద్, సంఘ సభ్యులు చిన్మయరావు, గనప రామేశ్వరరావు, నవీన్ చంద్రుడు, వి.భాస్కరరావు, మహిళలు ఝాన్సీరాణి, ఆచారి, వి.నాగేశ్వరరావు, పి.నాగేశ్వరరావు, సత్యవతి, అన్నపూర్ణ, రాంబాయి పాల్గొన్నారు.

భూసమస్యలు సకాలంలో పరిష్కరించాలి

జి.సిగడాం: రెవెన్యూ సదస్సుల ద్వారా రైతుల నుంచి వచ్చిన ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించాలని తహసీల్దార్ ఎం.శ్రీకాంత్ సిబ్బందికి సూచించారు. గురువారం జి.సిగడాం తహసీల్దార్ కార్యాలయంలో పీజీఆర్ఎస్ ఫిర్యాదులపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు నిరంతరం అందుబాటులో ఉంటూ వారి సమస్యలు పరిష్కరించాలన్నారు. సమావేశంలో డీటీలు ఎన్.నిర్మల, కె.గాయత్రి, ఆర్ఐ ఎ.రాధ, సర్వేయర్లు, వీఆర్‌ఓలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కౌన్సిల్‌కు నలుగురు ఎంపిక

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ రాష్ట్ర కౌన్సిల్‌కు శ్రీకాకుళం జిల్లా నుంచి నలుగురు జర్నలిస్టులు ఏకగ్రీవంగా ఎంపికైనట్లు రిటర్నింగ్ అధికారి డి.సోమసుందర్ గురువారం తెలిపారు. జిల్లా నుంచి బెండి నర్సింగరావు (టెక్కలి), కొంచాడ రవిశంకర్ (పలాస), జి.శ్రీనివాసరావు (పాతపట్నం), ఎం.వి.మల్లేశ్వరరావు(శ్రీకాకుళం) ఎన్నికవ్వడం పట్ల ఐజేయూ జాతీయ కార్యవర్గ సభ్యులు నల్లి ధర్మారావు, ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎస్.ఈశ్వరరావు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జగదీష్, సనపల రమేశ్ హర్షం వ్యక్తం చేశారు.

కొనసాగుతున్న ఆలయ ప్రతిష్టాపన పూజలు

ఎచ్చెర్ల క్యాంపస్/ఎచ్చెర్ల: అజ్జరాంలో ఉమా రామలింగేశ్వర పంచాయతన సహిత దేవాలయం ప్రతిష్టాపన పూజలు కొనసాగుతున్నాయి. రెండో రోజు గురువారం ఉదయం నుంచి సాయంత్రం వరకు వేద పండితులు భోగాపురపు హరిప్రసాద్ శర్మ ఆధ్వర్యంలో బృందం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ధాన్యం మిగులు..
రైతులు దిగాలు

- కొనుగోలు కోసం ఎదురుచూపులు
- పొంతనలేని సమాధానాలిస్తున్న అధికారులు

గార :

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో 2023–24 ఖరీఫ్ సీజన్‌లో పూసర్లపాడు, బూరవిల్లి రైతు భరోసా కేంద్రం పరిధిలో ఎస్ఎల్ఆర్ అనే సన్నరకం వరి రకాన్ని వ్యవసాయ శాఖ ప్రయోగాత్మకంగా అక్కడి రైతులకు పరిచయం చేస్తూ పంటను పండించారు. తెగుళ్లు లేకపోవడంతో గణనీయంగా దిగుబడి వచ్చింది. ఆ ఏడాది ప్రభుత్వ మద్దతు ధర 80 కేజీలకు రూ.1640 ఉంటే ప్రైవేటు కొనుగోలు రూ.2100లు పైమాటే. నూర్పులు అవ్వగానే ప్రైవేటు వర్తకులు వచ్చి నేరుగా గ్రామాల్లోనే కొనేశారు. 2024–25 ఖరీఫ్‌లో ఇప్పటి కూటమి ప్రభుత్వంలో పూసర్లపాడు, బూరవిల్లితో పాటు అంపోలు, వాడాడ, శ్రీకూర్మం వంటి మేజర్ పంచాయతీల్లో ఎస్ఎల్ఆర్ రకంతో పాటు ప్రభుత్వం అందించిన బీపీటీ సన్న రకాలు అధికంగానే సాగు చేశారు. డిసెంబర్ నెలాఖరులో కురిసిన వర్షాలతో



పూసర్లపాడు- బూరవిల్లి ప్రాంతంలో ఉన్న వరి కుప్పలు

వరి పనలను కళ్లాలకు తెచ్చుకోలేకపోయారు. మిగులు ధాన్యం ఇప్పటికీ రైతుల వద్దే మూగులుతున్నాయి. ఈ విషయమై ఈ నెల 14న జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తమ ఆవేదన వ్యక్తం చేశారు. ‘ఎదురు చూపులు ఫలించేనా’ అన్న శీర్షికతో ఈ నెల 15న సాక్షిలో లెవీ సేకరణపై రైతుల బాధను తెలియజేస్తూ కథనం ప్రచురితమయ్యింది. దీనిపై సివిల్ సప్లయ్ అధికారులు స్పందించి అంపోలు ప్రాంతంలో పర్యటించి ఉన్నతాధికారులకు నివేదిక అందజేసినట్టు తెలిసింది. వాస్తవంగా అంపోలు పరిధిలో వెయ్యి టన్నుల దాటి ధాన్యం ఉందని రైతులంటున్నారు. అయితే 200 టన్నులు మాత్రమే లెవీ సేకరణకు అనుమతిచ్చారు. ఇంకా దాదాపు 800 టన్నుల వరకు ధాన్యం ఉందని రైతులు చెబుతున్నారు.

బాధాకరం..



ఈ ఏడాది ధాన్యం లక్ష్యం అయిపోయిందని మిల్లర్లు అంటున్నారు. మా వాడాడ పరిధిలో రామచంద్రాపురం, గొంటి, దీపావళి, కిల్లిపాలేం, వాడాడకు సంబంధించిన రైతులున్నారు. మండలంలో కొన్ని పంచాయితీలకు ఇచ్చి మా పంచాయతీకి లెవీ ఇవ్వకపోవటం బాధాకరం. కల్లాలోనే ధాన్యం నిల్వలున్నాయి.

– సుంకాన సురేష్, సర్పంచ్, వాడాడ

చిన్నారులకు ఆట పాటలతో బోధన

ఎచ్చెర్ల క్యాంపస్: అంగన్‌వాడీ కేంద్రాల్లో పూర్వ ప్రాథమిక విద్యా బోధన ఆట పాటలతో సాగాలని ఎంఈఓ కె.పున్నయ్య అన్నారు. ఎచ్చెర్ల ప్రభుత్వ పాఠశాలలో పూర్వ ప్రాథమిక విద్యపై శిక్షణ కార్యక్రమం మూడో రోజు గురువారం కూడా కొనసాగింది. కార్యక్రమంలో ఎంఈవో–2 పి.రాజకిశోర్, ఐసీడీఎస్ పీవో పాపినాయుడు పాల్గొన్నారు.